అంతా కలిసి పేదల నోట్లో మట్టి కొట్టారు

భూచోళ్లు

- డి.పట్టా భూములు చేజిక్కించుకునేందుకు ఏడాది నుంచి వ్యూహం
- ప్రభుత్వ పెద్దల బినామీలకు రిజిస్ట్రేషన్

\- వార్త 7వ పేజీలో..

సర్వే సర్వత్రా..

ఎగ్జిట్ పోల్స్‌పై ఆసక్తి

- సాయంత్రం 6.30 గంటల నుంచి టీవీలకు అతుక్కుపోయిన జనం
- లోకల్ నుంచి జాతీయ స్థాయి వరకూ 45 సంస్థల ఎగ్జిట్ పోల్స్ వెల్లడి
- కూటమి విజయం సాధిస్తుందన్న 37 సంస్థలు
- వైసీపీ నెగ్గుతుందన్న ఎనిమిది సంస్థలు
- ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 12 స్థానాల వరకూ కూటమి కైవసం చేసుకుంటుందని పలు సంస్థల అంచనా
- విశాఖపట్నం, అనకాపల్లి ఎంపీ సీట్లు కూటమి ఖాతాలోకే...
- మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, బూడి ముత్యాలనాయుడు ఓడిపోబోతున్నారన్న 'ఆరా'
- విశాఖ 'నార్త్'లో టైట్ ఫైట్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

అందరిలోను ఒకటే ఉత్కంఠ. రాష్ట్రంలో ఏ పార్టీ గెలుస్తుంది?, జిల్లాలో ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి?, ఎవరు గెలుస్తారు?, ఎవరు ఓడిపోతారు?...ఎక్కడ చూసినా ఇదే చర్చ. ఈ ప్రశ్నలకు నాలుగో తేదీన సమాధానం లభించనున్నది. అయితే ఈలోగా సర్వే సంస్థలు కొంత స్పష్టత ఇచ్చాయి. దేశవ్యాప్తంగా చివరి విడత పోలింగ్ శనివారం ముగియడంతో సాయంత్రం 6.30 గంటల తరువాత వరుసగా ఒక దాని తరువాత మరొకటి ఎగ్జిట్ పోల్ వివరాలు వెల్లడించాయి. దాంతో జిల్లా వాసులు టీవీలకు అతుక్కుపోయి ఆసక్తిగా వీక్షించారు. దాదాపు 45కి పైగా సంస్థలు తాము చేపట్టిన సర్వే ఫలితాలు ప్రకటించాయి. వాటిలో 37 రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి, కేంద్రంలో ఎన్‌డీఏ అధికారంలోకి వస్తాయని తెలిపాయి. కేవలం 8 సంస్థలు మాత్రమే వైసీపీకి ఆధిక్యం లభిస్తుందని వెల్లడించాయి.

కొన్ని నెలల క్రితం పొరుగు రాష్ట్రమైన తెలంగాణాలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోను ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు ఇలాగే వచ్చాయి. కేసీఆర్ సారథ్యం వహిస్తున్న అధికార పార్టీ బీఆర్‌ఎస్ ఓడిపోతుందని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని సర్వే సంస్థలు తెలిపాయి. దీనిని బీఆర్‌ఎస్ అంగీకరించలేదు. అవన్నీ తప్పుడు సర్వేలని కేటీఆర్ కొట్టి పడేశారు. కానీ సర్వే సంస్థలు చెప్పిందే నిజమైంది.



విశాఖలో ఎగ్జిట్ పోల్స్‌ను ఆసక్తిగా తిలకిస్తున్న దృశ్యం

ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లోను సర్వే సంస్థలు ఏకపక్షంగా కూటమే అధికారంలోకి వస్తుందని తేల్చాయి. మొత్తం 175 అసెంబ్లీ స్థానాల్లో కూటమికి 144 సీట్లు వస్తాయని పయనీర్ సంస్థ వెల్లడించింది. కూటమి అధికారంలోకి వస్తుందని చెప్పిన సంస్థలు వైసీపీకి 60 సీట్లు వస్తాయని తేల్చాయి. ఇతర పార్టీలకు ఒకటి కంటే ఎక్కువ సీట్లు రావని పేర్కొన్నాయి. కేకే సర్వే సంస్థ అయితే కూటమికి 161 స్థానాలు వస్తాయని, వైసీపీకి కేవలం 14 సీట్లు మాత్రమే వస్తాయని వెల్లడించింది. రైజ్ సంస్థ కూటమికి 113-122, వైసీపీకి 48-60, చాణక్య స్ట్రాటజీస్ కూటమికి 114-125, వైసీపీకి 39-49, పీపుల్స్ పల్స్ సంస్థ కూటమికి 111-135, వైసీపీకి 45-60, ఆరా సంస్థ కూటమికి 71-81, వైసీపీకి 94-104 వస్తాయని ప్రకటించాయి. అలాగే చాణక్య సంస్థ వైసీపీకి 110-120, కూటమికి 55-65, జన్‌మత్ పోల్స్ వైసీపీకి 95-103, కూటమికి 65-75 సీట్లు వస్తాయని అంచనా వేశాయి.

పార్లమెంటు స్థానాల విషయానికి వస్తే...కూటమికి 21-23, వైసీపీకి 2-4 సీట్లు వస్తాయని ఇండియా టుడే వెల్లడించింది. అలాగే ఎన్‌డీటీవీ...కూటమికి 18, వైసీపీకి 7, రిపబ్లిక్ టీవీ...కూటమికి 14, వైసీపీకి 11, న్యూస్ 18 ...కూటమికి 19-22, వైసీపీకి 5-8, ఏబీపీ, సీ ఓటర్...కూటమికి 21-22, వైసీపీకి 0-4 సీట్లు వస్తాయని, ఇండియా టీవీ... కూటమికి 21 సీట్లు వస్తాయని ప్రకటించాయి.

విశాఖ జిల్లా చూసుకుంటే...

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో

... మిగతా 8వ పేజీలో

నిరుపయోగంగా సంత షెడ్లు

ఏజెన్సీలోని 17 వారపు సంతల్లో నిర్మాణాలు

- రూ.68 లక్షలు ఖర్చుచేసిన మార్కెటింగ్ శాఖ
- నిర్వహణను గాలికి వదిలేసిన వైనం
- మరమ్మతులకు గురై చిరు వర్తకులకు వసతి సమస్య

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

ఏజెన్సీ వారపు సంతల్లో నిర్మించిన సంత షెడ్లు మరమ్మతులకు గురై నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో వసతి సదుపాయం లేక చిరు వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. ఏజెన్సీలో గిరిజనులకు వారపు సంతలే ప్రధాన మార్కెట్‌లు. దీంతో ఎంపిక చేసిన 17 సంతల్లో రూ.68 లక్షల వ్యయంతో షెడ్లు నిర్మించారు. కానీ వాటి నిర్వహణపై అధికారులు దృష్టి సారించకపోవడంతో వినియోగానికి దూరమయ్యాయి. దీంతో చిరు వర్తకులకు వసతి సమస్య ఎదురవుతోంది.



హుకుంపేటలో నిరుపయోగంగా ఉన్న సంత షెడ్లు



పాడేరులో రోడ్డుపక్కనే చింతపండు విక్రయిస్తున్న మహిళలు (ఫైల్)

ఏజెన్సీలోని వారపు సంతల్లో చిరు వర్తకులకు ఉపయోగపడాయనే ఆలోచనతో గతంలో సంత షెడ్లు నిర్మించారు. ఒక్కో సంత షెడ్‌లో 40 దుకాణాలు ఉండేలా ఒక్కో సంతలో రూ.4 లక్షల వ్యయంతో గుత్తులపుట్టు, హుకుంపేట, కించుమండ, జి.మాడుగుల, వంట్లమామిడి, పెదబయలు, ముంచంగిపుట్టు, అరకు, సుంకరమెట్ట, డముకు, అనంతగిరి, కాశీపట్నం, అన్నవరం, చింతపల్లి, జీకేవీధి, ఆర్వీనగర్, కాకరపాడు ప్రాంతాల్లో నిర్మించారు. రైతుల అభిప్రాయాలకు విరుద్ధంగా మార్కెటింగ్ శాఖ అధికారులు నిర్ణయం తీసుకుని నిర్మించడంతో ఆరంభంలోనే వినియోగానికి దూరమయ్యాయి. వర్తకులు షెడ్లలో దుకాణాలు నిర్వహించుకునే వీలు లేకపోవడంతోపాటు క్రయవిక్రయాలు సాగని పరిస్థితి ఏర్పడింది. క్రమంగా షెడ్లు మరమ్మతులకు గురైనా పట్టించుకునే పరిస్థితి కనిపించలేదు. ఫలితంగా పూర్తిగా నిరుపయోగమయ్యాయి.

వసతి లేమితో అవస్థలు

ఏజెన్సీ వారపు సంతల్లో దుకాణాలు నిర్వహించుకునే వసతి లేకపోవడంతో చిరు వర్తకులు అవస్థలు పడుతున్నారు. ఏజెన్సీలో ఎక్కువ కాలం వర్షాలు కురుస్తుంటాయి. ఈ నేపథ్యంలో సంతల్లో దుకాణాలను నిర్వహించడానికి యాతన పడుతున్నామని వారంటున్నారు. రేకుల షెడ్ల నమూనాలో చిన్నచిన్న షెడ్లు నిర్మిస్తే దుకాణాలకు అనువుగా ఉంటుందని అంటున్నారు. సంతకు తీసుకువచ్చిన అటవీ/వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించేందుకు వసతి లేకపోవడంతో ఎక్కడో ఒక చోట వాటిని పెట్టి, ఏదో ధరకు విక్రయించాల్సిన దుస్థితి నెలకొందని గిరి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెటింగ్ శాఖ అధికారులు స్పందించి ఇప్పటికైనా వారపు సంతల్లో వసతి కల్పించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఓట్ల లెక్కింపు సజావుగా నిర్వహించాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయసునీత

- కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు మొబైల్స్ తీసుకురాకూడదని సూచన

పాడేరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఈ నెల 4న నిర్వహించే ఓట్ల లెక్కింపు ప్రక్రియను సజావుగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయసునీత అన్నారు. జిల్లాలోని పాడేరు, అరకులోయ, రంపచోడవరం అసెంబ్లీ స్థానాల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, కౌంటింగ్ అధికారులతో కలెక్టరేట్‌లో కౌంటింగ్ నిర్వహణపై శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కౌంటింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లను పక్కాగా సరిచూసుకోవాలన్నారు. జిల్లాలో పాడేరు, అరకులోయ అసెంబ్లీ స్థానాలకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, రంపచోడవరం అసెంబ్లీ స్థానానికి అక్కడి గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ ఏజెంట్ల నియామకంపై దృష్టి సారించాలని, వారికి అవసరమైన గుర్తింపు కార్డులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.విజయసునీత, పక్కన ఎస్పీ తుహిన్‌సిన్హా



సమావేశంలో పాల్గొన్న ఆర్వోలు, కౌంటింగ్ అధికారులు

జారీ చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి సిబ్బంది, ఏజెంట్లు మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకుని వెళ్లకూడదని కలెక్టర్ సూచించారు. అరకులోయ అసెంబ్లీ స్థానంలో లక్షా 74 వేల 588 మంది, పాడేరులో లక్షా 58 వేల 757 మంది, రంపచోడవరంలో 2 లక్షల 8 వేల 25 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. అరకులోయ నియోజకవర్గానికి సంబంధించి 304 పోలింగ్ కేంద్రాలు, 14 టేబుళ్లు, 22 రౌండ్లు, పాడేరులో 318 పోలింగ్ కేంద్రాలు, 14 టేబుళ్లు, 23 రౌండ్లు, రంపచోడవరంలో 399 పోలింగ్ కేంద్రాలు 20 టేబుళ్లు, 20 రౌండ్లు కౌంటింగ్ నిర్వహిస్తారన్నారు. తొలుత పోస్టల్ ఓట్లు, తరువాత ఈవీఎంల కౌంటింగ్ చేపట్టాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత, నిత్య పర్యవేక్షణ తదితర అంశాలపై సమీక్షించారు.


కౌంటింగ్ సిబ్బంది కోసం ప్రత్యేక బస్సులు

పాడేరు, అరకులోయ, రంపచోడవరం అసెంబ్లీ స్థానాలకు సంబంధించిన కౌంటింగ్ సిబ్బంది రాకపోకల కోసం ఆయా ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడుపుతామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయసునీత తెలిపారు. అందుకు గాను ఆర్టీసీ అధికారులకు ఆమె ఆదేశాలు జారీ చేశారు. కౌంటింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో సాధారణంగా ఏర్పడే సమస్యలు, వాటి పరిష్కారాలను కలెక్టర్ సూచించారు. కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు, అగ్నిమాపక శకటం ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీ తుహిన్‌సిన్హా మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని పాడేరు, అరకులోయ అసెంబ్లీ స్థానాలకు చెందిన కౌంటింగ్ కేంద్రాల సిబ్బంది, ఏజెంట్లు వేర్వేరుగా తమ కౌంటింగ్ సెంటర్లకు చేరుకోవాలన్నారు. అందుకు అనుగుణంగానే ప్రవేశ మార్గాలు, వాహన పార్కింగ్ వేర్వేరుగా ఏర్పాటు చేశామన్నారు. అకౌంటింగ్ కేంద్రాలకు మూడంచెల భద్రత ఉంటుందని, 144 సెక్షన్ అమల్లో ఉంటున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను కౌంటింగ్ ఏజెంట్లు విధిగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు, అరకులోయ ఆర్వోలు భావన వశిష్ఠ, అభిషేక్, చింతూరు ఐటీడీఏ పీవో చైతన్య, డీఆర్‌వో బి.పద్మావతి, ఏఎస్పీ కె.ధీరజ్, తదితరులు ప్రత్యక్షంగా పాల్గొనగా, రంపచోడవరం ఆర్వో ప్రశాంత్‌కుమార్, ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే వర్చువల్‌గా పాల్గొన్నారు.

ఎండ.. జోరువాన

- మధ్యాహ్నం వరకు దారెత్తించిన ఎండలు
- ఆ తరువాత నుంచి భారీ వర్షం

పాడేరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మన్యంలో రెండు రోజులుగా భిన్నమైన వాతావరణం కొనసాగుతున్నది. రాష్ట్ర విపత్తుల శాఖ సూచించినట్టుగానే మన్యంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తీవ్రమైన ఎండ కాస్తున్నది. మధ్యాహ్నం రెండు గంటల తరువాత ఒక్కసారిగా వాతావరణం మారిపోయి, ఆకాశం మేఘావృత మైపోతున్నది. దీంతో ఉరు ములు, మెరుపులు, పిడుగులతో కూడిన భారీ వర్షం కురుస్తున్నది. శనివారం సైతం ఇదే వాతావరణం ఏర్పడింది. పాడేరులో సా యంత్రం ఆరు గంటల నుంచి మబ్బుల వాతావరణం కొనసాగగా అరకులోయ, ముంచంగిపుట్టు, డుంబ్రిగుడ ప్రాం తాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఇదే పరిస్థితి మరో మూడు రోజులు కొనసాగే అవకాశాలున్నాయి.



ఎండ తీవ్రత వల్ల శనివారం మధ్యాహ్నం నిర్మానుష్యంగా ఉన్న పాడేరు- అరకులోయ జాతీయ రహదారి



హుకుంపేట మండలం తోటకూరపాడులో పిడుగుపాటుకు మృతి చెందిన మూగజీవాలు

పిడుగులతో ప్రమాదాలు

ఏజెన్సీలో మధ్యాహ్నం పిడుగులతో కూడిన భారీ వర్షం కురవడంతో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. శనివారం అరకులోయ మండలం పద్మాపురంలో పిడుగుపాటుకు రంగారావు అనే యువకుడు అక్కడిక్కడే మృతి చెందగా, సాయిబాబా అనే మరో యువకుడు గాయపడ్డారు. అలాగే శుక్రవారం కొయ్యూరు మండలంలో బూదరాళ్ల పంచాయతీ గొర్రెలమెట్ట గ్రామంలో పిడుగుపాటుకు సీదరి దేవరాజు(27) మృతి చెందాడు. హుకుంపేట మండలం దుర్గం పంచాయతీ తోటకూరపాడు గ్రామ సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం పిడుగు పడిన ఘటనలో నాలుగు దుక్కిటెద్దులు, 17 మేకలు అక్కడిక్కడే మృతి చెందాయి. ప్రకృతి వైపరీత్యం కారణంగా పశు సంపదను నష్టపోయిన తమను ఆదుకోవాలని బాధిత గిరిజన రైతులు కోరుతున్నారు. కాగా మరో మూడు రోజులు ఇదే వాతావరణం కొనసాగుతుందని, ప్రజలు ఎండలు, ఉరుములు, పిడుగులతో కూడిన భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని విపత్తుల శాఖ సూచిస్తున్నది.

రికార్డు స్థాయిలో పెరిగిన పసుపు ధర

- ఎండు పసుపు కిలో రూ.150



ఎండు పసుపు

గూడెంకొత్తవీధి, జూన్ 1: గిరిజన ప్రాంతంలో పసుపు ధర రికార్డు స్థాయిలో పెరిగింది. మార్కెట్ ఆఖరిలో ఎండు పసుపును వర్తకులు కిలో రూ.150 ధరకు కొనుగోలు చేస్తున్నారు. గిరిజన ప్రాంతంలో ఆదివాసీ రైతులు సాగుచేస్తున్న పసుపులో అధికంగా కుర్కుమిన్ ఉంటుంది. దీంతో గిరిజన ప్రాంత పసుపుకి మార్కెట్‌లో ఒక్కసారిగా ధర పెరిగింది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో పసుపు ధర రూ.180 పలుకుతోంది. ప్రస్తుతం చింతపల్లి, జీకేవీధి మండలాల్లో



జీకేవీధిలో ఎండు పసుపు కొనుగోలు చేస్తున్న వర్తకులు

ప్రైవేటు వర్తకులు కిలో రూ.150 ధరకు కొనుగోలు చేస్తున్నారు. పసుపు ధర భారీగా పెరడంతో ప్రాంతీయ రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయితే ముందుగా పంటను విక్రయించుకున్న రైతులు ఆవేదన చెందుతున్నారు.

హైవే నిర్మాణంలో 7,020 చెట్ల తొలగింపు

- ప్రత్యామ్నాయంగా పాడేరులో 120 హెక్టార్ల అటవీ అభివృద్ధి
- డీఎఫ్‌వో సూర్యనారాయణ పడాల్

చింతపల్లి, జూన్ 1: జాతీయ రహదారి 516-ఈ నిర్మాణంలో రిజర్వుడ్ ఫారెస్టుకి చెందిన 7,020 చెట్లను తొలగిస్తున్నట్టు స్థానిక డివిజన్ ఫారెస్టు అధికారి (డీఎఫ్‌వో) చిట్టపులి సూర్యనారాయణ పడాల్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజమండ్రి నుంచి విజయనగరం వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి చింతపల్లి డివిజన్ మీదుగా వెళుతుందన్నారు. కొయ్యూరు మండలం కాకరపాడు నుంచి జి.మాడుగుల మండలం వంజరి వరకు జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయన్నారు. రహదారి విస్తరణలో భాగంగా మారుజాతి, టేకు వృక్షాలను తొలగించాల్సి వస్తున్నదని తెలిపారు. 60 హెక్టార్లలో 7,020 వృక్షాలుగాను ఇప్పటి వరకు 6,620 తొలగించామన్నారు. మరో 400 వృక్షాలు తొలగించాల్సి వున్నదన్నారు. తొలగించి వృక్షాలను కాకరపాడు తాత్కాలిక టింబర్ డిపో, లోతుగెడ్డ జంక్షన్‌లోని శాశ్వత టింబర్ డిపోనకు తరలిస్తున్నామన్నారు. జాతీయ రహదారి విస్తరణలో తొలగించిన అటవీ వృక్షాలకు ప్రత్యామ్నాయంగా ఎన్‌హెచ్ అధికారులు పాడేరులో 120 హెక్టార్ల అటవీ అభివృద్ధి చేపట్టనున్నారన్నారు. అలాగే జాతీయ రహదారి నిర్మాణం అనంతరం రహదారి ఇరువైపులా మారుజాతి మొక్కలను ఎన్‌హెచ్ అధికారులు పెంపొందిస్తారన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న డీఎఫ్‌వో సూర్యనారాయణ పడాల్

అదుపులో అగ్నిప్రమాదాలు

డివిజన్ పరిధిలో అగ్నిప్రమాదాలు అదుపులో ఉన్నాయని డీఎఫ్‌వో తెలిపారు. డివిజన్ పరిధిలో 1.97 లక్షల హెక్టార్ల అడవులు ఉన్నాయన్నారు. వేసవిలో సంభవించే అగ్నిప్రమాదాలను అదుపు చేసేందుకు ఈ ఏడాది ప్రత్యేక చర్యలు తీసుకున్నామని చెప్పారు. గ్రామాల్లో విస్తృతంగా అవగాహన సమావేశాలు ఏర్పాటు చేసి కరపత్రాలు పంపిణీ చేశామన్నారు. ప్రతి ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో గిరిజన ప్రాంతంలో తొలకరి వర్షాలు కురుస్తాయన్నారు. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ మాసాల్లో ఒక్క వర్షం పడలేదన్నారు. దీంతో ఒక్కసారిగా 900 పాయింట్లలో అగ్నిప్రమాదాలు జరిగినట్టు భారత ప్రభుత్వం శాటిలైట్ ద్వారా గుర్తించిందన్నారు. ఈ సమాచారం వచ్చిన వెంటనే అటవీశాఖ ఉద్యోగులు అగ్నిప్రమాదాలను అదుపు చేశారన్నారు. మేలో వర్షాలు పడడం, ప్రజలను చైతన్యవంతులను చేయడం వల్ల అగ్నిప్రమాదాలు అదుపులో వున్నాయన్నారు. గిరిజనులు అడ్డపిక్కలు, బొడ్డెంగుల కోసం అడవికి వెళ్లి మంట పెట్టడం వల్ల అగ్నిప్రమాదాలు చోటు చేసుకున్నాయని ఆయన తెలిపారు.

క్రైం... crime news

గుర్తు తెలియని వ్యక్తి మృతి


మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

అనకాపల్లి టౌన్, జూన్ 1: స్థానిక నరసింగరావుపేటలోని టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌కు వెళ్లే రోడ్డులో శనివారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని గుర్తించామని పట్టణ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు. మృతుడు రెడ్ కలర్ నెక్ బనియన్, బ్లాక్ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడని, సుమారు 35 ఏళ్ల వయసు ఉంటుందని తెలిపారు. అయితే అతని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని, క్లూస్ బృందం కూడా తనిఖీ చేసిందన్నారు. మృతదేహాన్ని ఎన్టీఆర్ వైద్యాలయంలోని మార్చ్యురీకి తరలించామన్నారు. ఎవరైనా గుర్తిస్తే పట్టణ పోలీస్‌స్టేషన్‌కు సమాచారమందివ్వాలని ఆయన కోరారు.

నర్సీపట్నంలో గిరిజన మహిళ మృతదేహం

నర్సీపట్నం, జూన్ 1: పట్టణంలో ఓ మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. నర్సీపట్నం- చింతపల్లి రోడ్డులో మూత పడిన కల్పనా థియేటర్ సమీపంలో శనివారం ఉదయం ఒంటిపై దుస్తులు లేకుండా ఉన్న మహిళ మృతదేహం కనిపించడంతో స్థానికులు పట్టణ పోలీసులకు తెలియజేశారు. ఎస్ఐ ఉమామహేశ్వరరావు సిబ్బందితో అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. వెంటనే ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. మృతురాలు అల్లూరి సీతారామరాజు జిల్లా జిమాడుగుల మండలం గొప్పులపాలెం గ్రామానికి చెందిన జగ్గందొర లక్ష్మిగా గుర్తించినట్టు ఆయన చెప్పారు. చాలా కాలంగా ఈమె మతిస్థిమితం లేకుండా తిరుగుతుండడంతో కుటుంబ సభ్యులు వైద్యం చేయిస్తున్నారని తెలిపారు. పది రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వచ్చినట్టు కుటుంబ సభ్యులు తెలిపారని ఎస్ఐ వివరించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తామన్నారు.

లారీ బోల్తా : డ్రైవర్‌కు స్వల్ప గాయాలు


హైవే పక్కన బోల్తా పడిన లారీ

ఎలమంచిలి, జూన్ 1 : పట్టణంలోని పెదపల్లి జంక్షన్ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం లారీ బోల్తా పడిన ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అనకాపల్లి నుంచి తుని వైపు ప్రయాణిస్తున్న లారీ ఎదుటి వాహనాన్ని తప్పించే క్రమంలో హైవే పక్కన బోల్తా పడింది. ఈ సమయంలో వాహనాల రాకపోకలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. స్వల్ప గాయాలైన డ్రైవర్ విజయనగరం ప్రాంతానికి చెందిన వారని, అనకాపల్లి ఆస్పత్రికి వెళ్లినట్టు తెలిసింది. ఈ ప్రమాదానికి సంబంధించి పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.

వంగలిలో పిడుగు పడి రెండు పశువుల పాకలు దగ్ధం

» చూడి ఆవుకు తీవ్ర గాయాలు

సబ్బవరం, జూన్ 1 : మండలంలోని వంగలి గ్రామంలో శుక్రవారం రాత్రి ఉరుములు, మెరుపులు ధాటికి పిడుగులు పడి రెండు పశువుల పాకలు దగ్ధమయ్యాయి. పాకలో ఉన్న చూడి ఆవుకు తీవ్ర గాయాలయ్యాయి. మరో మూడు ఆవులు కన్నెలు తెంపుకొని పరుగులు తీశాయి. వివరాలిలా ఉన్నాయి. వంగలి గ్రామంలో కంద కనకరాజు, కంద సింహాచలం అన్నదమ్ములు ఉన్నారు. వీరి పశువుల పాకలు పక్క పక్కనే ఉన్నాయి. కనకరాజుకు ఉన్న నాలుగు పాడి పశువులను శుక్రవారం రాత్రి పది గంటలకు పాకలో కట్టేసి ఇంటికి వెళ్లిపోయాడు. ఉదయం 6 గంటలకు కల్లం వద్దకు వచ్చేసరికి రెండు పాకలు దగ్ధమై ఉన్నాయి. కనక రాజు పాకలో ఒక ఆవు మంటలకు తీవ్రంగా గాయపడి ఉంది. పిడుగుపాటుకు పాకలు దగ్ధమయ్యాయని గ్రహించి, పశువైద్యులకు సమాచారం అందించాడు. పశువైద్యులు వచ్చి సేవలు అందించారు. చూడి ఆవు పరిస్థితి విషమంగా ఉందని చెప్పారని బాధితుడు కనకరాజు తెలిపాడు. పాకలు దగ్గమవుతు న్నప్పుడు మూడు పశువులు కన్నెలు తెంపుకొని బయటకు పరిగెత్తాయని తెలిపాడు. నష్టం రూ2 లక్షలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రశాంత కౌంటింగ్‌కు సహకరించాలి : ఎస్పీ


మాట్లాడుతున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

అనకాపల్లి రూరల్, జూన్ 1 : ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా సాగేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు సహకరించాలని ఎస్పీ కేవీ మురళీకృష్ణ శనివారం రాత్రి ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలో ఆరు అసెంబ్లీ సెగ్మెంట్లు, ఒక ఎం స్థానానికి శంకరంలోని జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఓట్లు లెక్కిస్తారన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్దకు ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్లు మినహా ఇతరులు రావడానికి అనుమతి లేదన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. కౌంటింగ్‌కు వచ్చేవారు మొబైల్స్, ఇతర ఎలక్ట్రికల్ పరికరాలు, అగ్గిపెట్టెలు, సిగరెట్లు, పెన్, పేపరు ఎట్టి పరిస్థితుల్లో తీసుకు రాకూడదన్నారు. ఏజెంట్లు ఒకసారి కౌంటింగ్ కేంద్రం లోపలకు వెళ్లిన తరువాత పూర్తయ్యే వరకు బయటకు వెళ్లడానికి వీల్లేదని, ఏదైనా అనారోగ్య సమస్యలుంటే ముందుగా వాటికి సంబంధించిన మందులను తమ వెంట తీసుకు రావాలని సూచించారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాత విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా కాల్చేందుకు అనుమతి లేదన్నారు. సోషల్ మీడియాలో వచ్చే ఊహా జనిత వార్తలను నమ్మి ఎట్టి పరిస్థితుల్లోను వాటికి స్పందించరాదన్నారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే ప్రకటనలు, పోస్టులు పెట్టి గొడవలకు కారణమైతే వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. ఎవరైనా ఘర్షణలకు పాల్పడితే వారిని సీసీ టీవీ కెమెరాలు, డ్రోన్స్, బాడీవార్న్ కెమెరాలు, వీడియోగ్రఫీ ద్వారా గుర్తించి అటువంటి వారిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తామన్నారు. అలాగే రౌడీషీటు కూడా తెరవడం జరుగుతుందని ఎస్పీ కేవీ మురళీకృష్ణ హెచ్చరించారు. జిల్లాలోని 104 సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ పికెట్‌లు, పెట్రోలింగ్ పార్టీలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ పార్టీలను, క్యూఆర్ టీమ్‌లు, స్పెషల్ పార్టీ టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. పార్టీ కార్యాలయాల వద్ద, ప్రధాన పార్టీ అభ్యర్థుల ఇళ్ల వద్ద పోలీస్ భద్రత ఏర్పాట్లు చేశామన్నారు.

కౌంటింగ్ నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు

శంకరంలోని ఫ్యూచర్ వరల్డ్ పాఠశాలలో లెక్కింపు జరగనున్న నేపథ్యంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పలుచోట్ల ట్రాఫిక్ క్రమబద్ధీకరించడం జరుగుతుందని ఎస్పీ కేవీ మురళీకృష్ణ తెలిపారు. దీనిని గమనించి ప్రత్యామ్నాయ మార్గాల్లో తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని ఆయన సూచించారు. నేషనల్ హైవే -16 మీదుగా గాని, సుంకరమెట్ట కూడలి మీదుగాని, బొజ్జన్నకొండ రోడ్డు వైపు నుంచి గాని కౌంటింగ్ కేంద్రానికి చేరుకునే వారు రేబాక అండర్ పాస్ నుంచి సర్వీస్ రోడ్డు మీదుగా కలెక్టరేట్ ఆర్చ్ నుంచి చేరుకోవాలన్నారు. ఈ రూట్‌లలో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు, మీడియా మిత్రులకు అనుమతి ఉంటుందన్నారు. కౌంటింగ్ అధికారులు, సిబ్బంది రేబాక అండర్ పాస్ నుంచి గోపాలపురం రోడ్డు మీదుగా భట్లపూడి గ్రామం వద్ద దగ్గర వాహనాలను పార్కింగ్ చేసుకుని కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. కలెక్టరేట్ మెయిన్‌గేటుకు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఎలక్షన్ కమిషన్ అనుమతించిన మీడియా వారికి చెందిన వాహనాలకు మాత్రమే అనుమతించబడతాయన్నారు. కలెక్టరేట్ పక్కనున్న ఖాళీ స్థలంలో కౌంటింగ్ ఏజెంట్ల వాహనాలను పార్కింగ్ చేసుకోవాలన్నారు. కౌంటింగ్ కేంద్రానికి రెండు కిలోమీటర్ల నలుమూలల రెడ్‌జోన్‌గా ప్రకటించామని, ఎవరూ డ్రోన్‌లను ఎగర వేయరాదన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

భూ-చోళ్లు



» అంతా కలిసి పేదల నోట్లో మట్టి కొట్టారు » డి.పట్టా భూములు చేజిక్కించుకునేందుకు » ఏడాది నుంచి వ్యూహం

» తొలుత విశాఖ శివారుల్లో గల నాలుగు మండలాల్లో 2,000 ఎకరాల వరకూ ఉన్నట్టు గుర్తింపు

» ఆ తరువాత రైతులకు ఎకరాకు రూ.5 లక్షల అడ్వాన్స్ ఇచ్చి ఒప్పందాలు » తతంగం పూర్తయిన తరువాతే 'ఫ్రీ హోల్డ్' జీవో

» ఆనందపురం రామవరంలో 20 నుంచి 25 ఎకరాలు ప్రభుత్వ పెద్దల బినామీలకు రిజిస్ట్రేషన్

విశాఖపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి):
విశాఖ నగర శివారు, భోగాపురం ఎయిర్‌పోర్టు పరిసరాల్లో భూములు కొనుగోలు విషయంలో అత్యున్నత అధికారి తొలి నుంచి వ్యూహాత్మకంగా వ్యవహరించారు. విశాఖ చుట్టుపక్కల డి.పట్టా భూములు ఎక్కడెక్కడ ఉన్నాయో సమాచారం సేకరించిన సదరు కీలక అధికారి తన మనుషులను గత ఏడాది దసరా పండుగ నుంచే రంగంలోకి దింపారు. ఈ నేపథ్యంలో కీలక అధికారి బినామీ త్రిలోక్ నగర శివారుల్లోని రామవరం, గండిగుండం, మామిడిలోవ మరికొన్ని గ్రామాల్లో రైతులను కలుసుకుని బేరాలు కుదుర్చుకున్నారు. స్థానిక అధికారులు, వైసీపీ నేతల సాయంతో ఒప్పందాలు చేసుకున్నారు.

జిల్లాలోని గ్రామీణ మండలాల్లో నాలుగేళ్లక్రితం జగనన్న కాలనీలకు భారీగా పట్టా భూములను సమీకరించారు. ఇంకా జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌ల కోసం మరికొంత సేకరించగా నాలుగు మండలాల్లో సుమారు రెండు వేల ఎకరాలు మాత్రమే రైతుల వద్ద డి.పట్టా భూమి ఉందని అంచనాకు వచ్చారు. రైతుల వద్ద ఉన్న భూముల వివరాలను జిల్లా యంత్రాంగం ద్వారా కీలక ఉన్నతాధికారి తీసుకుని తన బినామీ త్రిలోక్‌ను రంగంలోకి దింపారు. ఆయన ఆనందపురం మండలం గండిగుండం, రామవరం, మామిడిలోవ, గిడిజాల, బాకూరిపాలెం, శొంఠ్యాం గ్రామాల్లో రైతులను కలిసి ఎకరాకు రూ.ఐదు లక్షలు ఇచ్చి ఒప్పందాలు చేసుకున్నారు.

ప్రభుత్వ పెద్దలు డి.పట్టా భూములు కొనుగోలుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకున్న తరువాత ప్రభుత్వం గత ఏడాది అక్టోబరు 27న సెక్షన్ 35/2023 పేరిట గజిట్ విడుదల చేసింది. ఆ తరువాత సుమారు రెండు నెలలకు అంటే గత డిసెంబరు 19న జీవో 596 జారీచేసింది. దీని ప్రకారం ప్రభుత్వం ఇచ్చిన డీపట్టా భూములపై సంబంధిత రైతులకు సర్వహక్కులు కల్పించేలా ఫ్రీ హోల్డ్ అనుమతులు ఇచ్చే అధికారం సంబంధిత జిల్లా కలెక్టర్లకు కల్పించింది. ఆ జీవో మేరకు జిల్లాలో డీపట్టా భూములు రైతుల వద్దే ఉన్నాయా?, లేవా?...అనేది వీఆర్వోలు సర్వే చేసి తహసీల్దార్లకు నివేదికలు అందజేస్తారు.

ప్రభుత్వ పెద్దలు ఒప్పందాలు కుదుర్చుకున్న భూములకు సంబంధించి ఆనందపురం మండల తహసీల్దార్ కార్యాలయం నుంచి వెళ్లిన ప్రతిపాదనలకు కలెక్టర్ నేతృత్వంలో కమిటీ ఆమోదం తెలిపిన తరువాత ఫ్రీ హోల్డ్ అనుమతులు వచ్చాయి. విచిత్రమేమిటంటే...గత ఏడాది అక్టోబరు 27న ప్రభుత్వం గజిట్ జారీచేసిన నెల రోజుల వ్యవధిలోనే అంటే నవంబరు 27న పలు గ్రామాల్లో డీపట్టా భూములను ఫ్రీ హోల్డ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. సాధారణంగా భూముల వ్యవహారంలో నెలలు, సంవత్సరాలు అధికారుల చుట్టూ తిరిగితే తప్ప అనుమతి దొరకదు. అటువంటిది కేవలం నెల రోజుల్లోనే క్షేత్ర స్థాయిలో సర్వే చేసి తహసీల్దారు..అక్కడ నుంచి ఆర్డీవో, అక్కడ నుంచి జేసీ...చివరిగా కలెక్టర్ నేతృత్వంలోని కమిటీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేసింది. ఈ విధంగా కొలవానిపాలెం, రామవరం, చందక, పెకూరు, గొట్టిపల్లి, బాకూరుపాలెం, గిడిజాల, శొంఠ్యాం, గండిగుండం, మామిడిలోవ గ్రామాల్లో భారీఎత్తున డీ పట్టా భూములను ఫ్రీహోల్డ్ చేశారు. ఈ ప్రక్రియ జరిగిన సుమారు 20 రోజుల తరువాత డిసెంబరు 19న జీవో నంబరు 596 వచ్చింది. అప్పటికే పలు గ్రామాల్లో రైతులతో ఒప్పందాలు కుదుర్చుకున్న త్రిలోక్ అండ్ గ్యాంగ్ నెమ్మదిగా రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. రామవరంలో గత ఏడాది కుదుర్చుకున్న ఒప్పందాలు మేరకు ఇప్పటివరకూ సుమారు 20 నుంచి 25 ఎకరాలకు రిజిస్ట్రేషన్లు జరిగిపోయాయి. మిగిలిన భూములకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టాలని భావించారు. అయితే గడచిన వారం, పది రోజుల నుంచి భూముల వివాదం బయటకు రావడంతో త్రిలోక్ బ్యాచ్ పొరుగునున్న భోగాపురం మండలంపై దృష్టిసారించారన్న ఆరోపణలు వస్తున్నాయి. రెండు రోజుల క్రితం భీమిలి మండలం అన్నవరం గ్రామంలో డీపట్టా భూముల్లో ఫెన్సింగ్ వేసే ప్రక్రియ వెనుక త్రిలోక్ హస్తం ఉందనే ఆరోపణలు వస్తున్నాయి.


గత ఏడాది నవంబరులో ఫ్రీహోల్డ్‌చేసిన రామవరం భూములు

వేకువజామున కుండపోత

» వాతావరణంలో మార్పుల కారణంగా పలుచోట్ల భారీ వర్షం
» చెరువులా మారిన గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట బస్‌స్టేషన్ ఆవరణ
» రోలుగుంట ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో విరిగిపడిన చెట్లు
» అంతటా చల్లబడడంతో ఉపశమనం పొందిన జనం


చెరువున్న తలపిస్తున్న కృష్ణాదేవిపేట బస్‌స్టేషన్ ఆవరణ


రోలుగుంట ఎంపీడీవో కార్యాలయంలో నేలకూలిన కొబ్బరిచెట్టు

కృష్ణాదేవిపేట, జూన్ 1 : వాతావరణంలో మార్పుల కారణంగా గొలుగొండ మండలంలో శనివారం వేకువజామున ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. పల్లె రహదారులు మరింత ఛిద్రంగా మారాయి. ముఖ్యంగా కృష్ణాదేవిపేట ఆర్టీసీ బస్‌స్టేషన్ ఆవరణ వర్షపు నీటితో చెరువును తలపించింది. కొన్ని గ్రామాల్లో డ్రైనేజీలు సరిగా లేకపోవడంతో మురుగు రోడ్లపై ప్రవహించింది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో గత వారం రోజులుగా ఎండలతో అల్లాడుతున్న జనం ఉపశమనం పొందారు. ఈ వర్షం ఖరీఫ్ సాగుకు ఎంతగానో దోహదపడుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రోలుగుంట : మండలంలో శనివారం తెల్లవారుజాము మూడున్నర గంటల ప్రాంతంలో భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులకు ఈదురు గాలులు తోడుకావడంతో పలు గ్రామాల్లో చెట్లు పడిపోయాయి. రోలుగుంటలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద కొబ్బరి చెట్లు నేలకూలాయి. అయితే ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లైంది. శుక్రవారం సాయంత్రం ఈ ఆవరణలో ఉన్న ఎంపీడీవో, ఎంఈవో, హౌసింగ్, ఉపాధి హామీ, వెలుగు, కార్యాలయాల సిబ్బంది విధులు ముగించుకుని ఇళ్లకు వెళ్లిపోయారు. శనివారం ఉదయం వచ్చి చూసేసరికి చెట్లు పడిపోయి ఉండడంతో ఒక్కసారిగా ఉక్కిలిక్కిపడ్డారు. తెల్లవారుజామున ఈ ఘటన జరిగిందని, అదే పగటి పూట జరిగి ఉంటే పరిస్థితి ఏమిటని ఆందోళన చెందారు.

బుచ్చెయ్యపేట : మండలంలో శనివారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షంతో వాతావరణ ఒక్కసారిగా చల్లబడింది. దీంతో వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలు ఉపశమనం పొందారు. గత వారం రోజులుగా భానుడి ఉగ్రరూపంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ దశలో కురిసిన వర్షం అందరిలో ఆనందాన్ని నింపిందని చెప్పవచ్చు.

మాడుగుల : ఉరుములు, మెరుపులతో శుక్రవారం రాత్రి మండలంలో భారీ వర్షం కురిసింది. దీంతో పల్లపు ప్రాంతాల్లో ఎటుచూసినా నీరే కనిపించింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కాగా, ఇన్నాళ్లూ ఉష్ణతాపంతో అల్లాడుతున్న జనం వాతావరణం చల్లబడడంతో ఆనందం వ్యక్తం చేశారు.

రావికమతం : తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడిపోతున్న ప్రజానీకం శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి సేదతీరారు. రోహిణి కార్తె కావడంతో పగటి ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరిగిపోయాయి. దీంతో అంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ తరుణంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షంతో అంతటా కాస్త చల్లబడింది.

300 కిలోల జాంగ్రీతో ఆంజనేయ ఆలయంలో పూజలు


విశేష అలంకరణలో స్వామి

చోడవరం, జూన్ 1 : హనుమాన్ జయంతిని శనివారం మండలంలోని పలు గ్రామాల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా చోడవరం పట్టణంలోని వ్యాపార వీధిలో గల అభయాంజనేయ ఆలయంలో అర్చకులు కె.ప్రసాదశర్మ, కె.విక్రమ్‌శర్మల ఆధ్వర్యంలో మూడు వందల కిలోల జాంగ్రీ స్వీటుతో స్వామికి పూజలు చేశారు. అంతకుముందు స్వామివారిని విశేషంగా అలంకరించారు. అలాగే, అంకుపాలెం గోవాడ, అంబేరుపురం, గజపతినగరం, లక్కవరం తదితర గ్రామాల్లో పెద్దఎత్తున పూజా కార్యక్రమాలు జరిగాయి. అంకుపాలెంలో జరిగిన పూజల్లో ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, స్థానిక నాయకులు చందురాంబాబు తదితరులు పాల్గొన్నారు.


జాంగ్రీ స్వీటును స్వామికి నైవేద్యంగా సమర్పిస్తున్న అర్చకులు

కబ్రిస్థాన్ స్థలం ఆక్రమణపై ఫిర్యాదు


సీనియర్ అసిస్టెంట్‌కు వినతి అందిస్తున్న షేక్ రహీంబీబీ తదితరులు

తహసీల్దార్ కార్యాలయ అధికారికి వివరించిన మత పెద్దలు

సబ్బవరం, జూన్ 1: మండల కేంద్రంలోని సర్వే నంబరు 258లో కబ్రిస్థాన్ (శ్మశానవాటిక)కు కేటాయించిన ప్రభుత్వ భూమి 50 సెంట్లును స్థానికులు ఆక్రమించుకున్నారని షేక్ రహీంబీబీ, గ్రామ మజీద్ కమిటీ సభ్యులు శనివారం తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కాసులమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సబ్బవరంలో 80 ముస్లిం కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. తమకు కబ్రిస్థాన్ (శ్మశాన వాటిక) లేదని పలు మార్లు రెవెన్యూ అధికారులకు, కలెక్టర్ వినతులు ఇవ్వగా. 2015లో సర్వే నంబరు 258లో 50 సెంట్లు భూమిని కేటాయించి, తమకు అప్పగించార న్నారు. అప్పటి నుంచి కబ్రిస్థాన్ తమ ఆధీనంలో ఉందన్నారు. తాము 2022లో ప్రహరీ నిర్మాణం చేపడుతుండగా పోలీసులు వచ్చి కోర్టులో కేసు ఉందని పనులు నిలిపేశారన్నారు. తాము ప్రస్తుతం హైకోర్టులో కబ్రిస్థాన్ స్థలం కోసం పోరాటం చేస్తున్నామన్నారు. అయితే ఇటీవల సబ్బవరానికి చెందిన కొందరు ఆ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్ని స్తునారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో షేక్ కరీమ్, షేక్ చెల్లాసాహేబ్, షేక్ బాబ్జీ తదితరులు ఉన్నారు.

కూటమి గెలుపు ఖాయం

» దుర్గమ్మను దర్శించుకున్న అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్

విజయవాడ, జూన్ 1 : ఎన్నికలలో ఖచ్చితంగా కూటమి గెలుస్తుందని అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి సీఎం రమేష్ అన్నారు. శనివారం ఆయన కుటుంబసమేతంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందజేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు సందర్భంగా అనకాపల్లి వెళుతూ అమ్మవారి దర్శనానికి కుటుంబసమేతంగా విచ్చేసినట్లు చెప్పారు. ఖచ్చితంగా ఎన్నికలలో కూటమి గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జగన్మోహనరెడ్డి 175 స్థానాలు తనకే అంటున్నాడని ముందు ఒకటో నెంబర్ కానీ ఆఖరి ఐదో నెంబర్ కానీ ఖచ్చితంగా ఎగిరి పోతాయన్నారు. విజయంతో తిరిగి తాను దుర్గమ్మను దర్శించుకోవడానికి వస్తానని తెలిపారు. ఆయన వెంట పలువురు బీజేపీ నాయకులు ఉన్నారు.

ఆర్ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాల కరస్పాండెంట్‌పై కోర్టు ధిక్కారణ పిటిషన్

» కళాశాల పూర్వపు ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఉమాశంకర్


హైకోర్టు తీర్పు పత్రాలను చూపుతున్న ఉమాశంకర్

కశింకోట, జూన్ 1 : స్థానిక ఆర్ఈసీఎస్ ఎండీ, రాజీవ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాల కరస్పాండెంట్ ఎం.శ్యామలపై కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసినట్టు కళాశాల పూర్వపు ప్రిన్సిపాల్ డాక్టర్ బి. ఉమాశంకర్ తెలిపారు. శనివారం ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. తనపై ఆర్థిక ఆరోపణలు చేసి, వారికున్న పలుకుబడితో జనరల్ బాడీ సమావేశంలో చర్చ జరపకుండా 2021 ఏప్రిల్ 19న సస్పెండ్ చేశారన్నారు. అనంతరం విచారణ సమయంలో సంబంధిత అధికారులను క్రాస్ ఎగ్జిమినేషన్ చేసే అవకాశం, న్యాయవాది సేవలు ఉపయోగించుకునే అవకాశం కూడా ఇవ్వకుండా ఉద్యోగం నుంచి తొలగిస్తూ 2022 జూన్ 6న ఉత్తర్వులు జారీ చేశారన్నారు. దీనిపై తాను హైకోర్టును ఆశ్రయించగా 2024 ఫిబ్రవరి 27న ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసిందని చెప్పారు. ఈ విషయాన్ని ఈ ఏడాది మార్చి 1న ప్రస్తుత ఎండీ శ్యామలకు కోర్టు ఆదేశాలు, వినతిపత్రాన్ని ఇచ్చానన్నారు. అలాగే ఏప్రిల్ 2న సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ కూడా ఆదేశాలు జారీ చేశారన్నారు. అయితే నేటి వరకు తనను విధుల్లోకి తీసుకోని కారణంగా శ్యామలపై కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను హైకోర్టులో దాఖలు చేసినట్టు డాక్టర్ బి.ఉమాశంకర్ వెల్లడించారు.

జవహర్‌రెడ్డి భూదందాపై విచారణ చేపట్టాలి

» మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీష్


సమావేశంలో మాట్లాడుతున్న బుద్ద నాగజగదీశ్వరరావు

తుమ్మపాల, జూన్ 1: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, అతని కుమారుడు, అనుచరులు కలిసి భోగాపురం ప్రాంతంలో 800 ఎకరాల భూదందాపై సమగ్ర విచారణకు సిట్ వేయాలని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం టీడీపీ పార్లమెంట్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ జీవో 596ను అడ్డం పెట్టుకుని డి.పట్టా భూములకు ఫ్రీ ఓల్డ్ అనుమతి తీసుకుని బినామీల పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. విశాఖ జిల్లా కలెక్టర్, ఉత్తరాంధ్ర మంత్రులు ఈ అంశంపై నోరు మెదపకపోవడం దారుణమన్నారు. బిల్లు ఏపీ పేరుతో 6,116 ఎకరాల భూమిని దళితుల నుంచి అధికార పార్టీ నాయకులు లాక్కొన్నారని ఆరోపించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో వేలాది ఎకరాల భూములు కబ్జాకు గురయ్యాయని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

సజావుగా పాలీసెట్ కౌన్సెలింగ్


కౌన్సెలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

అనకాపల్లి రూరల్, జూన్ 1 : మండలంలోని రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం ఆరో రోజు పాలీసెట్ కౌన్సెలింగ్ సజావుగా సాగింది. కళాశాల ప్రిన్సిపాల్ ఐవీఎస్ఎస్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టారు. 75,001 నుంచి 92 వేల ర్యాంక్ వరకు కౌన్సెలింగ్ జరిపారు. 149 మంది విద్యార్థుల ధ్రువపత్రాలను పరిశీలించి ఐసీఆర్ పత్రాలను అందజేశారు. ఇందులో 47 మంది బాలురు ఉండగా 102 మంది బాలికలు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారన్నారు. ఆదివారం 92,001 నుంచి 1,08,000 ర్యాంక్ వరకు కౌన్సెలింగ్ ఉంటుందని ఆయన తెలిపారు.

ఎప్పుడు ఉంటుందో.. ఎప్పుడు పోతుందో!

మన్యంలోని మారుమూల 50 గ్రామాలకు విద్యుత్ సరఫరా చేసే ధారకొండ సబ్ స్టేషన్ సమస్యలకు నిలయమైంది. వారం రోజులుగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. కరెంట్ ఎప్పుడు ఉంటుందో.. ఇంకెప్పుడు పోతుందో తెలియని దుస్థితి దాపురించింది. ఫలితంగా వేసవి తాపంతో అల్లాడిపోతున్న జనం మరింత ఆందోళన చెందాల్సి వస్తోంది. అయినప్పటికీ సంబంధిత అధికార యంత్రాంగం నిద్ర మత్తు వీడకపోవడంతో గిరిజనుల్లో అసంతృప్తి పెల్లుబుకుతోంది.

- ధారకొండ సబ్ స్టేషన్‌లో తరచూ విద్యుత్ సమస్యలు
- వారం రోజులుగా సరఫరాకు తీవ్ర అంతరాయం
- ఉష్ణోగ్రతలు పెరగడంతో అల్లాడుతున్న జనం
- పట్టించుకోని విద్యుత్ శాఖాధికారులు, పాలకులు

సీలేరు, జూన్ 1: గూడెంకొత్తవీధి మండలంలోని ధారకొండ 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి ధారకొండ, దుప్పులవాడ పంచాయతీల పరిధిలోని సుమారు 50 గ్రామాలకుపైగా విద్యుత్ సరఫరా అవుతోంది. సార్వత్రిక ఎన్నికలు ముగిసేంత వరకు ధారకొండ, దుప్పులవాడ పంచాయతీల్లో విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా 24 సరఫరా జరిగేది. సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తరువాత నుంచి ఆయా గ్రామాల ప్రజలకు కష్టాలు ఆరంభమయ్యాయి. విద్యుత్ సరఫరా ఎప్పుడు ఉంటుందో, ఇంకెప్పుడు పోతుందో తెలియని పరిస్థితుల్లో వారంతా ఆందోళన చెందుతున్నారు. గత వారం రోజులుగా విద్యుత్ సమస్య మరీ అధికంగా ఉంది. విద్యుత్ కోతలు విధిస్తున్నారో, లేక లైన్లపై ఏమైనా చెట్లు పడి అంతాయం ఏర్పడుతుందో తెలియని పరిస్థితి నెలకొందని సబ్ స్టేషన్ పరిధిలోని 50 గ్రామాల గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల ఏజెన్సీ ప్రాంతంలో కూడా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో పాటు దోమలు అధికంగా పెరిగిపోవడంతో విద్యుత్ సరఫరా లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ కోత ఉంటే రెండు లేదా మూడు గంటల పాటు ఉంటుందని, మండు వేసవిలో గంటల తరబడి విద్యుత్ సరఫరా లేకపోతే ఎలాగని గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ధారకొండ 33 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని ప్రతి రోజూ గంటల పాటు నిలిపివేస్తున్న విద్యుత్ సరఫరా అంతరాయంపై దృష్టిసారించాలని, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ధారకొండ, దుప్పులవాడ పంచాయతీల గిరిజనులు వేడుకుంటున్నారు.



ధారకొండ పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరా చేసే సబ్ స్టేషన్ ఇదే...



కౌంటింగ్ ఏర్పాట్లపై అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ విజయసునీత

కౌంటింగ్ కేంద్రాల్లో కలెక్టర్ తనిఖీలు

పాడేరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయసునీత శనివారం రాత్రి తనిఖీలు చేశారు. ముందుగా కౌంటింగ్ కేంద్రాల్లోనే ఏర్పాట్లు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం అక్కడ ఉన్న ఈవీఎంల స్ట్రాంగ్ రూములను తనిఖీ చేసి, భద్రతా ఏర్పాట్లపై ఆరా తీశారు. కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్‌రూములకు సంబంధించిన సీసీ కెమెరాల ఫుటేజీలను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.పద్మావతి, చింతూరు ఐటీడీఏ పీవో చైతన్య, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వీవీఎస్.శర్మ తదితరులు పాల్గొన్నారు.

397 మూగజీవాలకు వ్యాధి నిరోధక టీకాలు



కొత్తవలసలో పశువులు, మేకలను టీకాలు వేస్తున్న పశు వైద్య సిబ్బంది

పాడేరు రూరల్, జూన్ 1: మండలంలోని వంజంగి పంచాయతీ కొత్తవలస గ్రామంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక పశు వైద్య శిబిరంలో 397 మూగజీవాలకు వ్యాధి నిరోధక టీకాలు వేశామని పశు సంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ చందక నరసింహులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నట్టల నివారణ కార్యక్రమంలో భాగంగా సీజనల్‌గా వచ్చే వ్యాధుల నివారణ చర్యల్లో పాడి పశువులకు జబ్బవాపు నివారణ టీకాలు, మేకలు, గొర్రెలకు వ్యాధి నివారణ టీకాలను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలంలోని ప్రతీ పంచాయతీలో పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నామని, ఈ విషయాన్ని ముందుగానే ఆయా గ్రామాల రైతులకు సమాచారం ఇస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వంట్లమామిడి పశు వైద్యాధికారి రాజీవ్ కిశోర్, పశు సంవర్థక సహాయకులు పి.శీనుబాబు, కె.కోటిబాబు, అమృత సంస్థ కార్యదర్శి సంతోష్ గోవర్థిని, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సబ్ డీఎఫ్‌వో రాజు సేవలు అభినందనీయం

- చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శ్రీకాంత్‌నాథ్‌రెడ్డి



సబ్ డీఎఫ్‌వో రాజు దంపతులను సన్మానిస్తున్న అటవీ శాఖ అధికారులు

చింతపల్లి, జూన్ 1: అటవీ శాఖలో సుదీర్ఘ కాలం అంకితభావంతో పనిచేసిన ఆర్‌వీ నగర్ సబ్ డీఎఫ్‌వో ఎస్ఎస్ బెర్నార్డ్ రాజు సేవలు అభినందనీయమని విశాఖపట్నం చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు (సీసీఎఫ్) ఎస్.శ్రీకాంత్‌నాథ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో ఉద్యోగ విరమణ పొందిన సబ్ డీఎఫ్‌వోకు శనివారం సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దిగువ స్థాయి ఉద్యోగులతో కలిసిపోయి అటవీ సంరక్షణ కోసం రాజు ప్రత్యేకంగా కృషి చేశారన్నారు. కుటుంబ సభ్యుల సహకారంతో సమర్థవంతంగా విధులు నిర్వహించారన్నారు. ఆర్‌వీ నగర్ సబ్ డివిజన్ పరిధిలో ఆయన కృషి ఫలితంగా అడవులు పచ్చగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ సీసీఎఫ్ పి.రామ్మోహన్‌రావు, చింతపల్లి, పాడేరు, అనకాపల్లి, విశాఖపట్నం డీఎఫ్‌వోలు చిట్టపులి సూర్యనారాయణపడాల్, కె.వినోద్‌కుమార్, జి.లక్ష్మణ్, ఎం.సోమసుందరం, రిటైర్డ్ ఏసీఎఫ్ సిహెచ్.జార్జ్ పాల్గొన్నారు.

పిడుగుపాటుతో యువకుడి మృతి

- మరో యువకుడికి తీవ్ర గాయాలు
- మృతుడు హుకుంపేట మండలం గూనగుమ్మ వాసి



మృతి చెందిన యువకుడు రంగారావు

అరకులోయ, జూన్ 1: మండలంలోని పద్మాపురంలో పిడుగు పడడంతో ఓ యువకుడు మృతి చెందాడు. మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. శనివారం మధ్యాహ్నం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పద్మాపురంలో యువకులు వాలీబాల్ ఆడుతుంటారు. ఈ క్రమంలో హుకుంపేట మండలం పాతకోట పంచాయతీ గూనగుమ్మ గ్రామానికి చెందిన గెమ్మెలి రంగారావు, గెమ్మెలి సాయిబాబాతో పాటు మరి కొందరు గిరిజన యువకులు వాలీబాల్ ఆడేందుకు శనివారం పద్మాపురం వచ్చారు. దీంతో పద్మాపురం యువకులు, గూనగుమ్మ యువకులు వాలీబాల్ పోటీలో తలపడ్డారు. ఈ క్రమంలో మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయి ఉరుములు, పిడుగులతో భారీ వర్షం కురిసింది. దీంతో వాలీబాల్ ఆడుతున్న కొందరు యువకులు సమీప ఇళ్లల్లోకి వెళ్లగా, మరి కొందరు అక్కడే ఉన్న చెట్టు కిందకు వెళ్లారు. ఈ క్రమంలో అకస్మాత్తుగా ఆ చెట్టుకు సమీపంలో పిడుగుపడింది. దీంతో చెట్టుకిందన ఉన్న గెమ్మెలి రంగారావు అక్కడికక్కడే మృతి చెందగా, అదే గ్రామానికి చెందిన మరో యువకుడు గెమ్మెలి సాయిబాబాకు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనలో అక్కడున్న యువకులు హుటాహుటిన స్పందించి తీవ్రగాయాలైన సాయిబాబాను స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స చేసిన వైద్యులు యువకుడికి ప్రాణాపాయం తప్పిందని తెలిపారు.

గూనగుమ్మిలో విషాదం

వాలీబాల్ ఆడేందుకు వెళ్లిన తమ గ్రామానికి చెందిన యువకులపై పిడుగుపడి ఒకరు మృతి చెందడంతో హుకుంపేట మండలం గూనగుమ్మిలో విషాదం నెలకొంది. వాలీబాల్ ఆడేందుకు వెళ్లిన పది మంది యువకులు ఒకే గ్రామానికి చెందిన వారు కావడంతో పాటు అందరూ బంధువులే అవుతారు. ఈ క్రమంలో అనుకోని విధంగా రంగారావు పిడుగుపాటుకు బలికావడంతో గూనగుమ్మివాసులు కన్నీరుమున్నీరవుతున్నారు. పోలీసులు మృతదేహాన్ని అరకుఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

ఓట్ల లెక్కింపులో ఏజెంట్లు నిబంధనలు పాటించాలి

- పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గిడ్డి ఈశ్వరి

పాడేరు రూరల్, జూన్ 1: ఓట్ల లెక్కింపునకు హాజరయ్యే పార్టీ ఏజెంట్లు ఎన్నికల నిబంధనలను పాటించాలని పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి కోరారు. కుమ్మరిపుట్టులోని నివాస గృహంలో శనివారం పార్టీ ఏజెంట్లతో ఆమె సమావేశమయ్యారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ విధానం గురించి వివరించి, నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని సూచించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాలకు వెళ్లే సమయంలో మద్యం తాగకూడదని చెప్పారు. కేంద్రాల వద్ద మద్యం తాగారో, లేదోనన్న నిర్ధారణ కోసం బ్రీత్ అనలైజర్ టెస్టులు చేస్తారన్న విషయం గుర్తుంచుకోవాలని ఆమె సూచించారు. అలాగే మద్యం తాగినట్టు నిర్ధారణ జరిగితే ఏజెంట్‌ను లెక్కింపు కేంద్రాల్లోకి అనుమతించరన్న విషయాన్ని గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు రాజమండ్రి నారాయణ, పి.గోవిందరావు, రొబ్బి రాము, కౌంటింగ్ ఏజెంట్లు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిలో రోగులకు పరామర్శ

వివిధ వ్యాధుల బారిన పడి జిల్లా సర్వజన ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్న రోగులను పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గిడ్డి ఈశ్వరి శనివారం పరామర్శించారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. అలాగే వైద్యులు అందించే మందులను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని, సకాలంలో పౌష్టికాహారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కె.వెంకట సురేష్‌కుమార్ పాల్గొన్నారు.



ఏజెంట్ల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి ఈశ్వరి

మన్యంలో భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి

పాడేరు రూరల్, జూన్ 1: మన్యంలోని పలు మండలాల్లో హనుమాన్ జయంతిని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జిల్లా కేంద్రం పాడేరులోని పాత బస్టాండ్, సుండ్రుపుట్టు, అయ్యప్పస్వామి, ఉమానీలకంఠేశ్వర ఆలయ ప్రాంగణంలో ఉదయం నుంచి ఆలయ ప్రధాన అర్చకులు పూజలు, అభిషేకాలను నిర్వహించారు. వందల సంఖ్యలో భక్తులు హాజరై ఆంజనేయస్వామికి పూజలు చేశారు. అలాగే నక్కలపుట్టు, మినుములూరు, బొక్కెళ్లు, చింతలవీధి, రాయిగెడ్డ, ఇరడాపల్లి, గుత్తులపుట్టు గ్రామాల్లో హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. నక్కలపుట్టులో ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

చింతపల్లిలో...

చింతపల్లి: మండలంలోని చౌడుపల్లి పంచాయతీ కేంద్రంలో హనుమాన్ జయంతిని భక్తులు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. భక్తులకు కంటా రమణ దంపతులు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. స్వామికి భక్తులు గృహాల నుంచి సారెను తీసుకువచ్చి సమర్పించారు. కార్యక్రమంలో ఏడీఏ జాహ్నవి, హెచ్‌ఎం నరసింగరావు, గ్రామ పెద్దలు డి.వెంగళయ్య, వి.చిన్నారావు, కంటా బాలక్రిష్ణ పాల్గొన్నారు.

సీలేరులో...

సీలేరు: సీలేరు ఆంజనేయ స్వామివారి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక ఆలయంలో స్వామివారికి వేద పండితులు పంచామృతాలతో అభిషేకం, సింధూర అభిషేకం, ఆకుపూజ చేశారు. అలాగే ఆలయ ప్రాంగణంలో మహిళలతో కోలాటం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



చింతపల్లిలో ఇళ్ల నుంచి సారె తీసుకువెళ్తున్న భక్తులు... నక్కలపుట్టు ఆలయంలో స్వామిని అలంకరించిన కమిటీ ప్రతినిధులు

కొయ్యూరులో...

కొయ్యూరు: మండలంలోని ఆడాకుల గ్రామంలో హనుమాన్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన అప్పన గజ్జియదొర దంపతులు హనుమాన్ విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. వైస్ ఎంపీపీ అప్పన వెంకటరమణ మధ్యాహ్నం అన్నసమారాధన ప్రారంభించారు. కార్యక్రమంలో పరిసర పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

చింతపల్లి, జూన్ 1: ఎన్నికల ప్రవర్తన నియమావళి మండల ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ అరుణ్‌కిరణ్ సూచించారు. మండల కేంద్రంలోని పలు వీధులు, గృహాలను శనివారం పోలీసు సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియ సమీపిస్తుండడంతో ఎక్కడా హింసాత్మక సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాజకీయ పార్టీల నాయకులు, అభిమానులు సమన్వయం పాటించాలన్నారు. ఎక్కడా గుంపులుగా సంచరించకూడదని, సమావేశాలు ఏర్పాటు చేయరాదన్నారు. ఫలితాలు అనంతరం ఎక్కడా సంబరాలు జరుపుకోవడానికి అనుమతిలేదన్నారు. గ్రామాల్లో అనుమానితులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమచారం ఇవ్వాలన్నారు. రికార్డులు లేని పది వాహనాలను ఎస్సై సీజ్ చేశారు.

దిగజనబలో పేలిన ఐరన్ ఓర్ పైప్‌లైన్ మరమ్మతులు

చింతపల్లి, జూన్1: మండలంలోని దిగజనబ గ్రామ సమీపంలో పేలిన ఐరన్ ఓర్ పైప్‌లైన్ మరమ్మతులు చేయించామని స్థానిక తహసీల్దార్ టి.రామకృష్ణ తెలిపారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ మీదుగా భూగర్భ పైప్‌లైన్ ద్వారా ఆర్సెలోర్‌మిట్టల్ నిప్పన్ కంపెకి ద్రవ రూపంలో ఐరన్ ఓర్ తరలించడం జరుగుతుందన్నారు. శుక్రవారం అర్ధరాత్రి అధిక ఉష్ణోగ్రతల కారణంగా పైప్‌లైన్ పేలిపోయిందని, దీంతో ఐరన్‌ఓర్ గిరిజనుల పంట పొలాల్లో పేరుకుపోయిందన్నారు. కంపెనీ టెక్నికల్ సిబ్బందితో దిగజనబ గ్రామానికి వెళ్లి పైప్‌లైన్ మరమ్మతులు చేయించామన్నారు. రైతుల పంట పొలాల్లో పేరుకుపోయిన ఐరన్ ఓర్ తొలగించామని, రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కంపెనీని కోరినట్టు ఆయన చెప్పారు. తహసీల్దార్ వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

సర్వే సర్వత్రా...

... 5వ పేజీ తరువాయి

మొత్తం 15 అసెంబ్లీ స్థానాలు ఉండగా అందులో 12 స్థానాలు కూటమికి, 3 వైసీపీకి వస్తాయని పలు సంస్థలు వెల్లడించాయి. అరకులోయ, పాడేరు, మాడుగుల స్థానాలు మాత్రమే వైసీపీకి వస్తాయని, మిగిలినవన్నీ కూటమికే దక్కుతాయని విశ్లేషించాయి. జనసేన పోటీ చేసిన నాలుగు (అనకాపల్లి, ఎలమంచిలి, విశాఖపట్నం దక్షిణం, పెందుర్తి) సీట్లు గెలుచుకుంటుందని, విశాఖ ఉత్తరంలో బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్ రాజు గెలుస్తారని తెలిపాలి.

'ఆరా' మస్తాన్ ఎగ్జిట్ పోల్స్‌ను వెల్లడిస్తూ రాష్ట్రంలో ప్రముఖులు పోటీ చేసిన చోట ఫలితాలు ఎలా ఉండబోతున్నాయో చెప్పారు. ఆయన లెక్కల ప్రకారం విశాఖ జిల్లాలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్ (గాజువాక) ఓడిపోతున్నారు. అనకాపల్లిలో ఎంపీగా పోటీ చేసిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఓడిపోతారని, కూటమి అభ్యర్థి సీఎం రమేశ్ గెలుస్తారని వెల్లడించారు. విశాఖ ఉత్తరంలో బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు, వైసీపీ అభ్యర్థి కేకే రాజు నుంచి టైట్ ఫైట్ ఎదుర్కొన్నారని విశ్లేషించారు. విశాఖపట్నం పార్లమెంటు టీడీపీ అభ్యర్థి శ్రీభరత్ గెలుపు ఖాయమని, ఆయనకు మెజారిటీ కూడా భారీగా వస్తుందని పలు సంస్థలు విశ్లేషించాయి.

గురుకుల కళాశాలల్లో అదనపు సీట్లు పెంచాలి

దరఖాస్తు చేసిన ప్రతీ విద్యార్థికి సీటు కేటాయించాలి: సీపీఎం నేత అప్పలనర్స



విలేకరులతో మాట్లాడుతున్న అప్పలనర్స

పాడేరు రూరల్, జూన్ 1: గిరిజన గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రవేశాలకు అదనపు సీట్లు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని గురుకుల కళాశాలల్లో దరఖాస్తు చేసుకున్న ప్రతీ విద్యార్థికి సీటు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ విద్యా సంవత్సరం ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు సుమారు రెండు వేల మంది దరఖాస్తు చేసుకుంటే కేవలం 450 సీట్లను మాత్రమే భర్తీ చేశారన్నారు. దీంతో మిగిలిన విద్యార్థులు ప్రవేశాల కోసం జిల్లా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ప్రభుత్వం, అధికారులు స్పష్టమైన సమాచారం ఇవ్వకపోవడం విచారకరమన్నారు. గత విద్యా సంవత్సరం పాడేరు, అరకు, గూడెంకొత్తవీధి బాలికల గురుకుల కళాశాలల్లో 200 సీట్లు అదనంగా పెంచారని, ఈ ఏడాది మాత్రం అదనపు సీట్ల కేటాయింపుపై అధికారులు సిఫారసు చేయకపోవడం విచారకరమని ఆయన వాపోయారు. ముంచంగిపుట్టు మండలంలో గిరిజన బాలికల గురుకుల కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎల్.సుందరరావు, చిన్నారావు పాల్గొన్నారు.

టిప్పర్ బోల్తాపడి ఇద్దరికి గాయాలు



పన్నేడా సమీపంలో రోడ్డుపై బోల్తాపడ్డ టిప్పర్

పెదబయలు, జూన్ 1: మండలంలోని సీకరి పంచాయతీ పన్నేడా సమీపంలో శనివారం ఉదయం ఓ టిప్పర్ లారీ బోల్తా పడింది. దీంతో ఇద్దరికి గాయాలయ్యాయి. మండల కేంద్రం నుంచి ఓ టిప్పర్ లారీ శనివారం తెల్లవారు జామున చిప్స్ కోసం పాడేరు క్రషర్స్‌కు వెళ్లింది. లోడ్‌తో తిరుగు ప్రయాణంలో పెదబయలు సమీపంలోని పన్నేడా వద్ద ఎదురుగా వచ్చే వాహనానికి దారి ఇస్తున్న క్రమంలో బోల్తా పడింది. దీంతో టిప్పర్‌లో ఉన్న డ్రైవర్, మరొకరికి గాయాలయ్యాయి. స్థానిక ప్రజలు క్షతగాత్రులను వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఆస్పత్రికి తరలించారు. కాగా, టిప్పర్ బోల్తాతో రహదారిరువైపులా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో అటుగా రాకపోకలు సాగిస్తున్న వాహన చోదకులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలి

- అనకాపల్లి డీఈవో వెంకటలక్ష్మమ్మ

సబ్బవరం, జూన్ 1: విద్యార్థులకు రుచికరమైన ఆహారం వండి పెట్టాలని జిల్లా విద్యా శాఖాధికారిణి ఎం.వెంకటలక్ష్మమ్మ అన్నారు. స్థానిక గురుకుల పాఠశాల్లో శనివారం జిల్లాలో 22 పాఠశాలలకు చెందిన 70 మంది కుక్ కమ్ హెల్పర్లకు నిర్వహిం చిన వంటలపై అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆరు రోజులు పాటు ఆరు రకాల వంటలను రుచికరంగా వండాలన్నారు. ఈ సందర్భంగా వారు తయారు చేసిన వంటలను రుచి చూశారు. రుచికరంగా వండిన స్థానిక ప్రభుత్వ హైస్కూల్ కుక్ గౌరీకి ప్రోత్సాహక బహుమతిని ఇచ్చి అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 బీఎస్ఎన్ మూర్తి, ఎంఈవో-1 లక్ష్మణరావు, పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘించి చిక్కుల్లో పడవద్దు : సీఐ

రాంబిల్లి, జూన్ 1: రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎన్నికల కోడ్ ఉల్లంఘించి చిక్కుల్లో పడవద్దని రాంబిల్లి సీఐ లక్ష్మణరావు అన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న నేపథ్యంలో గ్రామాల్లో ర్యాలీలు, ఊరేగింపులకు ఎటువంటి అనుమతులు లేవన్నారు. బాణసంచా విక్రయాలపై కూడా నిషేధం విధించామన్నారు. ఎన్నికల ఫలితాల సమయంలో ప్రజలంతా సమన్వయం పాటించాలన్నారు. గ్రామాల్లో శాంతి భద్రతల విషయంలో అందరూ పోలీసులకు సహకరించాలని సీఐ కోరారు.

సంక్షిప్తంగా..

సంతకాలతో ముగిసిన మండల సర్వసభ్య సమావేశం

డుంబ్రిగుడ, జూన్ 1: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరగాల్సిన సర్వసభ్య సమావేశం సభ్యుల సంతకాలతోనే ముగించారు. ఎంపీపీ బాక ఈశ్వరి అధ్యక్షతన జరగాల్సిన సమావేశం ఎన్నికల కోడ్ నిబంధనలతో నిర్వహించలేదు. ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు మండల సమస్యలపై చర్చించి వెనుదిరిగారు. ఎన్నికల కోడ్ ఉండడంతో అధికారులు కూడా హాజరుకాలేదని ఎంపీడీవో జయ ఉమ తెలిపారు.

ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా సహకరించాలి: ఎస్ఐ రవీంద్ర

ముంచంగిపుట్టు, జూన్ 1: మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్ఐ కె.రవీంద్ర కోరారు. మండల కేంద్రంలో శనివారం జరిగే వారపు సంత రోజు ఎక్కువగా ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని స్థానికులు ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. ఈ మేరకు నాలుగు రోడ్ల కూడలిపై ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తగిన చర్యలు చేపడుతున్నామని చెప్పారు. వాహనాలు ఎక్కడబడితే అక్కడ నిలిపి ఉంచితే చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తేందుకు కారణమైన వారిపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

సీలేరు, జూన్ 1: సీలేర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ ఏడాది ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు జరుగుతున్నాయని ప్రిన్సిపాల్ శంకరరావు తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులు తమ సర్టిఫికెట్లతో కళాశాలకు వచ్చిన ఐదు నిముషాల్లోనే ప్రవేశాలు కల్పిస్తామని చెప్పారు. దూర ప్రాంతాల విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈ కళాశాలలో డిజిటల్ క్లాసులు, కంప్యూటర్ శిక్షణ, క్రీడల్లో ప్రతిభ ఉన్న విద్యార్థులకు జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఎంపికలు వంటి అవకాశాలు ఉన్నాయన్నారు. పదో తరగతి పాసైన విద్యార్థులు కళాశాలలో చేరాలని ఆయన కోరారు.

అరకులో భారీ వర్షం

అరకులోయ, జూన్ 1: మండలంలో శనివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు సాధారణ వాతావరణమే కొనసాగింది. తర్వాత ఒక్కసారిగా వాతావరణం మారిపోయి ఉరుములు, పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి రహదారులన్నీ జలమయమయ్యాయి. పంట పొలాల్లోకి వర్షం నీరు చేరింది. కొంత వరకు జన జీవనానికి అంతరాయం కలిగినప్పటికీ, వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఊరట చెందారు.

మెనూ పక్కాగా అమలు చేయాలి

గూడెంకొత్తవీధి, జూన్ 1: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు మెనూ పక్కాగా అమలు చేయాలని మండల విద్యా శాఖ అధికారి-1 తగ్గి సత్యనారాయణ ఆదేశించారు. స్థానిక ఎంఆర్‌సీ భవనంలో శనివారం మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు భోజనాలను అత్యంత పరిశుభ్రంగా, రుచికరంగా సిద్ధం చేయాలని సూచించారు. విద్యార్థులకు పూర్తి స్థాయిలో సరిపడేలా భోజనాలు తయారు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 నారాయణరావు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో పరుగు పోటీలు

డుంబ్రిగుడ, జూన్ 1: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో శనివారం పరుగు పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి సునీత ఆధ్వర్యంలో బాలురు, బాలికలకు ఈ పోటీలను ఏర్పాటు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వచ్చే నెల 7వ తేదీ వరకు వివిధ రకాల క్రీడా పోటీలను నిర్వహిస్తామన్నారు. ప్రతీ రోజు నిర్వహిస్తున్న ఈ పోటీల్లో బాలబాలికలకు పాల్గొని క్రీడా నైపుణ్యాలను చాటిచెప్పాలని సూచించారు. అలాగే పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేస్తామని ఆమె చెప్పారు.

మారుమూల గ్రామాల్లో వైద్య సేవలు

సీలేరు, జూన్ 1: దుప్పులవాడ పంచాయతీలోని మారుమూల గ్రామాల్లో సీలేరు వైద్యాధికారి కె.సౌమ్య ఆధ్వర్యంలో శనివారం వైద్య సేవలు అందించారు. వలసగెడ్డకొత్తూరు, వలసగెడ్డ, శాండికోరి గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించారు. 46 మందికి వైద్య పరీక్షలను నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ప్రస్తుతం ఎపిడిమిక్ సీజన్ కావడంతో గిరిజనులు రోగాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి చుట్టూ గుంతలు, నీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టాలని, గర్భిణులు ప్రతి నెలా పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ సౌమ్య సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది త్రినాథ్, సత్యనారాయణ, కేవీఎస్ కుమారీ తదితరులు పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఉత్సవాల రాట ప్రతిష్ఠ

పెదబయలు, జూన్ 1: మండల కేంద్రంలో మోదకొండమ్మ జాతర మహోత్సవాల కోసం ఆదివారం ఆలయం వద్ద రాట ప్రతిష్ఠించనున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. అనంతరం ఉత్సవ రాటను ఊరేగింపుగా తీసుకువెళ్లి సతకంపట్టు వద్ద ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు.

గురుకుల కళాశాల ల్యాబ్ అసిస్టెంట్ మృతి

చింతపల్లి, జూన్ 1: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ గురుకుల కళాశాలలో పనిచేస్తున్న ల్యాబ్ అసిస్టెంట్ ఎస్.కోటిలింగం అనారోగ్యంతో మృతి చెందారు. కోటిలింగం కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో శుక్రవారం రాత్రి గృహంలో తుది శ్వాస విడిచారు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.